క్లుప్తంగా...

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న శ్రీరామ్ శివకుమార్

లాలాపేట: కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటర్‌గా తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన శ్రీరామ్ శివకుమార్ నియమితులయ్యారు. గురువారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని, దేశాన్ని రక్షించుకుందాం: ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్: దేశ పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వలి ఉల్లాహ్ ఖాద్రి, కె.ధర్మేంద్ర విమర్శించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభల సందర్భంగా 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం–దేశాన్ని రక్షించుకుందాం' అనే నినాదంతో వీధి నడక ప్రచారం నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లో ప్రతి ఇల్లు, వ్యాపార సముదాయాలు తిరిగి రాజ్యాంగాన్ని–దేశాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వలి ఉల్లాహ్ ఖాద్రి, ధర్మేంద్ర మాట్లాడుతూ... అక్టోబర్ 29, 30వ తేదీలలో హిమాయత్ నగర్‌లోని తెరాపంత్ భవన్‌లో ఏఐవై ఎఫ్ రాష్ట్ర 2వ మహాసభలు జరగనున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని వారు యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్, నేతలు మాజీద్, కళ్యాణ్, చెట్టుకింద శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు స్వతంత్ర భారతికి తెలంగాణ సంగీత హారతి

చిక్కడపల్లి: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంలో భాషా కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న స్వతంత్ర భారతికి తెలంగాణ సంగీతభారతి పేరిట దుబాయిలో గానవిభావరి నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు మధుబాపుశాస్త్రి తెలిపారు. దివ్యకాంతి, ప్రశాంతి, శ్వేత, ప్రగతి, శశిధరం, మల్లేష్‌లు గాన విభావరి, చిన్నారి నైశిత నృత్యంతో పాలుపంచుకుంటారన్నారు. ఈ సందర్భంగా నటుడు సాయికిరణ్, వ్యాపారవేత్త రామ్‌కుమార్, రామచందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారి టిఆర్‌కె రావుతోపాటు విష్ణుప్రసాద్, డబ్బింగ్ కళాకారుడు ఆర్‌సి ఎం.రాజు, జ్యోతిష్కుడు బుట్టి వీరభద్రదైవజ్ఞ, సత్యం, తిరుపతి కార్యక్రమ కన్వీనర్ శ్రీనివాస్ పార్టీలకు సత్కారం ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం చిక్కడపల్లిలో ఆవిష్కరించారు.

కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలి

హిమాయత్‌నగర్: హెచ్‌ఎంటీ సంస్థలో ఒక డివిజన్‌గా ఉన్న బాలానగర్‌లోని ప్రాగాటూల్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు 5 నెలలుగా జీతాలు చెల్లించటం లేదని, రిటైరైన కార్మికులకు 5 సంవత్సరాలుగా పీఎఫ్ కానీ, గ్రాట్యుటీ కానీ చెల్లించలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ డిమాండ్ చేశారు. రిటైరైన కార్మికులందరూ ఎలాంటి ఇతర ఆదాయం లేక, పీఎఫ్, గ్రాట్యుటీ రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హెచ్‌ఎంటీ యాజమాన్యం, పీఎఫ్ అధికారులు కానీ కార్మికుల బాధలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. బాలానగర్‌లో ప్రాగాటూల్స్‌కు సుమారు 40 ఎకరాలు స్థిరాస్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు తొలగకపోవటానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రాగాటూల్స్‌కు ఉత్పత్తి చేయటానికి ఆర్డర్స్ ఉన్నా పెట్టుబడి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రాగాటూల్స్‌కు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి ఉత్పత్తి సక్రమంగా నడవటానికి చర్యలు చేపట్టాలని బోస్ డిమాండ్ చేశారు.



తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం



బస్తీలో రోడ్లపై పారుతున్న మురుగు



సీసీ రోడ్ల నిర్మాణం కోసం రోడ్డును సగం వరకు తవ్వి వదిలేసిన దృశ్యం

అభివృద్ధికి నోచుకోని ఆర్యనగర్

- డిప్యూటీ మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్న పనులు
- నేటికీ పూర్తికాని వైనం
- వసతులు లేక ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

లాలాపేట: జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని ఆర్యనగర్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఆర్యనగర్‌లో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం గత తొమ్మిదేళ్లుగా కొనసాగుతూనే ఉంది. బిల్డింగ్ నిర్మాణం చేసి రంగులేశారు. భవనంలో ఏర్పాటు చేయాల్సిన కనీస వసతులు ఇంటీరియర్ పనులు చేయకుండా వదిలేసారు. దీంతో ఇప్పటికీ అది ప్రజలకు అందుబాటులోకి రాలేదు. గతేడాది సీసీ రోడ్ల నిర్మాణం కోసం బస్తీలోని రోడ్లని తవ్వి వదిలేసారు. దీంతో నిలిచిపోయిన సీసీ రోడ్ల నిర్మాణం, మరో వైపు డ్రైనేజీలు మురుగు ఏరులై పారుతోంది.

500 కుటుంబాల నివాసం..

సికింద్రాబాద్ నుంచి మౌలాలి, వరంగల్, విజయవాడ, విశాఖపట్టంణకు వెళ్లే రైలు మార్గం(రైల్వే ట్రాక్) పక్కన ఉన్న ఈ ప్రాంతంలో బొగ్గుతో రైళ్లు నడిచే కాలంలో ఇక్కడ బొగ్గు డంపింగ్ చేసేవారు. దీంతో ఈ ప్రాంతాన్ని బూడిదిగడ్డగా పిలిచేవారు. కాలక్రమేనా స్వాతంత్రానికి పూర్వం 1946లో కొందరు ఈ ప్రాంతంలో ఆర్యసమాజ్‌ను ఏర్పాటు చేశారు. తదనంతరం ఇక్కడ కొందరు నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని ఆర్యనగర్‌గా పేరు వచ్చింది. ప్రస్తుతం ఇక్కడ దాదాపు 500 కుటుంబాలు (ఎస్సీలు 350, ముస్లింలు 150) నివాసముంటున్నాయి. వీరంతా పేద మధ్య తరగతి ప్రజలే.

చిన్నచూపు..

ఎస్సీలు అధికంగా ఉండే ఆర్యనగర్ అంటే ఆది నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధుల చిన్నచూపు చూస్తున్నారే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర రాజధానికి సమీపంలోనే ఉన్న ఈ ప్రాంతం నేటికి అభివృద్ధి నోచుకోలేదు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టి దాదాపుగా తొమ్మిదేళ్లు కావస్తున్నా ఇంకా పూర్తి కాలేదు. సీసీ రోడ్ల నిర్మాణం చేస్తామని గతేడాది రోడ్లు తవ్వారు. సదరు గుత్తేదారు పనులు ఆపేసి ఇప్పటి వరకు పత్తాలేకుండా పోయారు. బస్తీలో పాత కాలం నాటి డ్రైనేజీ లైన్లే కావడంతో తరచూ డ్రైనేజీలు పొంగి బస్తీలో మురుగు నీరు ప్రవహిస్తుంటుంది. దీనికి తోడు కలుషిత నీటి సమస్య. యువతకు ఏర్పాటు చేస్తామన్న జిమ్ ఇప్పటికీ చేయానేలేదు. ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్యలను ఎవరితో చెప్పుకున్నా పరిష్కరం కావడం లేదని ఆ ప్రాంతం వాసులు వాపోతున్నారు. ఏళ్ల తరబడి చేస్తున్న పనులపై గట్టిగా అధికారులను నిలదీస్తే 'తాము ఏం చేయాలి కంట్రాక్టర్లు తమ మాట వినడం లేదని' చెప్పడం కొసమెరుపు.

మళ్లీ బూడిది గడ్డగానే మారుతుంది..

ఒక వైపు బంగారు తెలంగాణ అంటూ ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది. కానీ నగరంలోని దళితులు, మైనార్టీలు నివసించే ప్రాంతాల అభివృద్ధిని నేటి పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పేదలు నివసించే ప్రాంతాలు ఉన్నాయి. ఆర్యనగర్‌లో అభివృద్ధి పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా వాటిని సకాలంలో పూర్తి చేయించడంలో అధికారులు తీవ్రంగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఆర్యనగర్ మళ్లీ బూడిదిగడ్డగా మారుతోంది.

–కుమార్ షాను, ఆర్యనగర్ యువజన సంఘం నేత

29న శిల్పకళా వేదికలో ఆటిజంపై అవగాహన



వివరాలు వెల్లడిస్తున్న ఉషారాణి

అమీర్‌పేట: ఆటిజం, తలసీమియా, ట్రాన్స్‌జెండర్ల కోసం పనిచేస్తున్న మార్గం రెసోనేటింగ్ రెసిలెన్స్ స్వచ్ఛంద సంస్థ స్పెక్ట్రమ్ స్పార్కిల్ అనే పేరుతో మొదటి సారిగా ఆటిజంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అమీర్‌పేట గ్రీన్‌పార్క్ హోటల్ మ్యారీగోల్డ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డెక్కన్ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రొఫెసర్, సైకియాట్రీ విభాగం హెడ్ డాక్టర్ మిస్ హాజ్ జాఫర్, నీలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉషారాణి వివరాలను వెల్లడించారు. అక్టోబర్ 29న శిల్ప కళావేదికలో అవగాహన సదస్సు ఉంటుందని చిన్నారులకు చేయాల్సిన రోగ నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు, విద్య, ఉపాధి, భవిష్యత్‌పై నిపుణుల కమిటీ ప్యానెల్ సభ్యులు చర్చిస్తారన్నారు. ప్రాథమిక దశలో ఆటిజం సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించడం ద్వారా చికిత్స అందిస్తే సమస్య నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ఆటిజంతో జీవిస్తున్న కుటుంబాలు ఎదుర్కొంటున్న ప్రత్యేకమైన సవాళ్లను కళ్లకు కట్టేలా దేశంలో మొదటి సారిగా రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌ను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ప్రతిభావంతులైన ఆటిస్టిక్ పిల్లలందరికి అవార్డులను అందచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆటిజం అవగాహనపై రూపొందించిన షార్ట్ ఫిల్మ్ గుంజాయిష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో రోష్ని కౌన్సెలింగ్ సెంటర్ వైద్యులు జయంతి సుందర్ రాజన్,నబత్ లఖానీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్ బస్తీలో గురువారం బోనాల వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. బొడ్రాయి ప్రతిష్ఠోత్సవ కార్యక్రమం అనంతరం బస్తీ ప్రజలు బోనాల పండుగను నిర్వహించారు. డప్పుచప్పుళ్లు..బ్యాండ్ మేళాలు..పోతరాజుల నృత్యాల నడుమ బోనాల సంబరాలు అంబరాన్ని తాకాయి. భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బోనాల వేడుకలకు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పవన్‌కుమార్ గౌడ్ అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు సుభాష్, యాదగిరి, రవి, అంజయ్య, ఫోటో నర్సింగ్, కుషాల్‌లతో పాటు సురేష్, రవిచారీ, ముక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.



హమాల్‌బస్తీలో బోనాలు తీసుకొస్తున్న మహిళలు

'ఆరు గ్యారంటీ'లకు అనూహ్య స్పందన



ప్రచారం చేస్తున్న కోట నీలిమా

బన్సీలాల్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోట నీలిమా అన్నారు. గురువారం ఇంటింటికి అభయాస్తం పేరుతో మోండా మార్కెట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలిమా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఇంటింటికి వివరించామన్నారు. ఇన్నేళ్లు గడుస్తున్నా మోండా మార్కెట్ ఎందుకు ఆధునికీకరించడం లేదని ప్రశ్నించారు. కేవలం నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసమే మోండా మార్కెట్‌ను ఆధునికీకరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. మోండా మార్కెట్‌లో స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల అక్రమ వ్యాపారాలు సాగుతున్నాయని వాటికి ఇబ్బందులు వస్తాయనే కొత్తగా మార్కెట్ నిర్మాణం చేపట్టడం లేదని ఆరోపించారు. అవినీతి రహిత పాలన కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు.


ఈవీఎంలు వచ్చేశాయ్

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను ఉస్మానియా యూనివర్సిటీలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజ్‌లో భద్రపరిచారు. ఇక్కడే నియోజకవర్గానికి చెందిన డిస్ట్రిబ్యూషన్ రిసిప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం నియోజకవర్గానికి చెందిన 229 బూత్‌ల ఈవీఎంలను ఇక్కడకు చేర్చారు. ఎన్నికలకు ముందు రోజు ఈ ఈవీఎంలను ఎన్నికల సిబ్బందికి అధికారులకు అప్పగిస్తారు.

30 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

రాంగోపాల్‌పేట్: ఎన్నికల సందర్భంగా మార్కెట్ పోలీసులు చేస్తున్న తనిఖీల్లో 30 తులాల బంగారం పట్టుబడింది. గురువారం సాయంత్రం మార్కెట్ పోలీసులు మోండా మార్కెట్‌లో వాహనాల తనిఖీలు చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడిని నిలిపి తనిఖీలు చేయగా 30 తులాల బంగారం ఆభరణాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన ఎలాంటి రసీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం



రాంగోపాల్‌పేట్: గుర్తు తెలియని ఓ మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. బోయిగూడ అల్పూతా హోటల్ ఎదురుగా మెట్రో పిల్లర్ నంబర్ 990 వద్ద ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడిఉన్నట్లు సమాచారం మేరకు వెళ్లిన పోలీసులు వివరాల సేకరించారు. మృతుడికి వయస్సు 40–45 ఉంటుందని డార్క్ బ్లూ చొక్కా, స్కై బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.


ఢిల్లీకి 'ఆప్' నాయకులు

లిబర్టీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర నాయకత్వం ఢిల్లీ బయలుదేరి వెళ్లింది. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు వచ్చే శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై జాతీయ నాయకత్వంతో చర్చించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ సారథ్యంలోని ప్రతినిధి బృందం గురువారం ఢిల్లీ బయలుదేరింది. పార్టీ జాతీయ కన్వీనర్ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జీ శాసన సభ్యులు సోమనాథ్ భారతితో పాటు రాజ్య సభ, లోక్‌సభ సభ్యులతో సమావేశం కానున్నారు. తెలంగాణలో ఆమ్ ఆద్మీ పార్టీ పరిస్థితి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అంశం పోటీ చేస్తే ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలి, రాష్ట్రంలో పార్టీని పటిష్ట పరచడం విస్తరించడం బలోపేతం చేయడం తదితర అంశాలను వివిధ ప్రధాన రాజకీయ పార్టీల పరిస్థితి వంటి విషయాలను అరవింద్ కేజ్రీవాల్‌కు వివరిస్తామని డాక్టర్ సుధాకర్ తెలిపారు. ప్రతినిధులు బృందంలో కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము తదితరులు ఉన్నారు.

ఆజాలో కల్ట్ కలెక్షన్

సాక్షి, సిటీబ్యూరో: నాఫ్స్ ఆధ్వర్యంలో నగరంలోని ఆజా వేదికగా అద్భుతమైన 'కల్ట్ కలెక్షన్'ను గురువారం ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో మిసెస్ ఇండియా–2020 నీరూ మోహన్ పాల్గొని సందడి చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ... పాతకాలపు సోయగాలను ఆధునికీకరించి మరింత సౌందర్య హంగులను నగరవాసులకు అందిచడానికి ఈ కలెక్షన్‌ను ఆవిష్కరించామని తెలిపారు.

పోటీ ఇక్కడ.. ఓటు అక్కడ!





రాంగోపాల్‌పేట్: రాజకీయాల్లో ఇద్దరు తలపండిన యోధులు..మంత్రులు, ఎమ్మెల్యేలుగా పలుమార్లు పనిచేసి ప్రజల్లో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కానీ ఇద్దరు నేతలు నివాసం ఒక నియోజకవర్గం కాగా వారు పోటీ చేసేది మరో నియోజకవర్గం కావ డం గమనార్హం. వారే రాజకీయాల్లో తలపండిన నేతలు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రస్తుతం సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి మూడోసారి బరిలో ఉన్నారు. 1994, 1999లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1994లో పోటీ చేసే సమయంలో ఆయన సనత్‌నగర్ నియోజకవర్గంలోని ఆదయ్యనగర్‌లో ఉండేవారు. 1999లో సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మారేడు పల్లిలోనే ఉండేవారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో టీడీపీ తరుపున, 2018లో బీఆర్ఎస్ పార్టీ నుంచి సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి శ్రీనివాస్ యాదవ్ పోటీ చేసి విజయం సాధించారు. ఇప్పుడు మూడో సారి ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నా ఆయన నివాసం ఉండేది మాత్రం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వెస్ట్‌మారేడు పల్లిలో ఉంది. ఆయన ఓటు హక్కు కూడా వెస్ట్ మారేడుపల్లిలోని కస్తూర్బా కాలేజ్‌లో ఉంది.

- డిప్యూటీ స్పీకర్ టీ పద్మారావుగౌడ్ నివాసం ఉండేది సనత్‌నగర్ నియోజకవర్గం మోండా మార్కెట్‌లోని టకారాబస్తీలో. కానీ ఆయన 2004, 2014, 2018లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఇప్పుడు కూడా సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బరిలో ఉన్నారు. పద్మారావు నివాసం టకారాబస్తీ కావడంతో ఆయన ఓటు హక్కు మోండాలోని ఇస్లామియా హైస్కూల్‌లోని బూత్‌లో ఉంది. అయితే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టి పెరిగింది మోండా మార్కెట్ ప్రాంతంలోని ఆదయ్యనగర్ కాగా ప్రస్తుతం మారేడుపల్లిలో ఉంటున్నారు. పద్మారావు మాత్రం పుట్టిపెరిగింది టకారాబస్తీలో కానీ ఆయన సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించడంతో పాటు ప్రస్తుతం బరిలో ఉన్నారు. రాష్ట్రంలో బలమైన నాయకులు ఇద్దరు నివాసం ఉండేది, ఓటు హక్కు వినియోగించుకునేది ఒక చోట కాగా పోటీ చేసేది మరో చోట కావడం గమనార్హం. అయితే ప్రస్తుతం సికింద్రాబాద్ నియోజకవర్గంలో లోకల్ నాన్ లోకల్ అంశం పెరగడంతో దానికి పెద్దగా ప్రాధాన్యం లేదు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే విజయానికి సోపానాలు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయని సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. గొల్లకొమురయ్య కాలనీ నుంచి ప్రారంభమైన ప్రచారానికి అడుగడుగునా సన్మానాలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూలేని విధంగా సనత్‌నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలతో నియోజకవర్గం రూపురేఖలను మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేశామని, అభివృద్ధి పనులు మీ కళ్లముందే కనిపిస్తున్నాయని వాటిని చూసి రానున్న ఎన్నికల్లో తమను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 400 గ్యాస్ సిలిండర్ మరో లక్ష డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. ప్రచారంలో కార్పొరేటర్ కె. హేమలత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంగళహారతులతో తలసానికి స్వాగతం పలుకుతున్న మహిళలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తూ..

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ గాంధీనగర్ ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు వెంకన్న, రాధేశ్యామ్ బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలన పట్ల ఎంతో మంది ఆకర్షితులైన పార్టీలో చేరుతున్నారని సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. అంతకు ముందు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గాంధీనగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.

బీఆర్‌ఎస్ పాలనలో కంటోన్మెంట్‌లో మార్పులు

కంటోన్మెంట్: సీఎం కేసీఆర్ పాలనలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ రూపురేఖలు మారాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆమె ఐదోవార్డు పరిధిలోని మహాత్మాగాంధీ నగర్ బస్తీ, సంజీవయ్యనగర్, వీకర్ సెక్షన్, సెకండ్ లక్ష్మినగర్, ఇంద్రపురి రైల్వే కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనతండ్రి, దివంగత ఎమ్మెల్యే సాయన్న నాయకత్వంలో ప్రతి వార్డులోనూ పెద్ద ఎత్తున అభివృద్ధిని జరిగిందని అభివృద్ధిని చూసి తనను భారీ మెజార్టీతో ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. సమైక్యపాలనలో అభివృద్ధికి నోచుకోని కంటోన్మెంట్ నియోజకవర్గం ఇప్పుడు అభివృద్ధికి కేరాఫ్‌గా మారిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టితో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. మిగిలిన చిన్న చిన్న సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. పాదయాత్రలో నివేదిత, పెద్దాల నర్సింహా యాదవ్, గిరి, రావు, రాజు, రిచర్డ్ రాజు, బాలమ్మ, పద్మ పాల్గొన్నారు.




ఐదోవార్డులో ప్రచారం నిర్వహిస్తున్న లాస్య నందిత

పలువురు నేతల గైర్హాజరు..

గ్రూపు తగాదాల నేపథ్యంలో ఐదోవార్డులో లాస్య నందిత నిర్వహించిన పాదయాత్రకు పలువురు పార్టీ నేతలు గైర్హాజరయ్యారు. వార్డు అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి పెంట శ్రీహరితో పాటు శర్వీన్, భాస్కర్ ముదిరాజ్, రేపాల వెంకటేశ్ పాదయాత్రకు దూరంగా ఉన్నారు. తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వనందునే ప్రచారంలో పాల్గొనలేదని వారు పేర్కొనడం గమనార్హం.

ఎందుకెళ్లారు..ఎక్కడున్నారు!

- వివిధ కారణాలతో నలుగురి అదృశ్యం



మల్లేష్

అడ్డగుట్ట: వివిధ కారణాలతో వేర్వేరు ఘటనల్లో నలుగురు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్, లాలాగూడ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో చోటు చేసుకున్నాయి. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం.. మహేంద్రాహిల్స్‌లోని త్రిమూర్తి కాలనీకి చెందిన మల్లేష్ (40) స్థానిక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 25న పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన మల్లేష్ తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన భార్య లక్ష్మి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మతిస్థిమితం సరిగాలేని వృద్ధురాలు..



ఐలా బాయి

నార్త్‌లాలాగూడలోని ఇందిరా నగర్ ప్రాంతానికి చెందిన తల్వార్ ఐలా బాయి (75)కు మతిస్థిమితం సరిగాలేదు. మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. ఆమె కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా, తెలిసిన వారిని వాకాబు చేసినా ఫలితం లేకపోవడంతో కుమారుడు శివశంకర్ ఫిర్యాదు చేసినట్లు లాలాగూడ ఎస్ఐ అమర్ సింగ్ పేర్కొన్నారు.

కూతురితో సహా తల్లి..

శాంతినగర్‌కు చెందిన స్వప్న (28) ఆమె కూతురు నేహా(08)తో కలిసి మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఉద్యోగం ముగించుకొని రాత్రి స్వప్న భర్త రమేష్ ఇంటికొచ్చిన సమయంలో భార్య, కూతురు కనిపించకపోవడంతో భయాందోళనకు గురై బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు



స్వప్న



నేహ

ఇద్దరితో ప్రేమాయణం.. మరో యువతితో నిశ్చితార్థానికి సిద్ధం

వెంగళరావునగర్: ఇద్దరు యువతులను మోసం చేసి మూడో యువతితో పెళ్లితంతుకు సిద్ధమైన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఆ వ్యక్తి తనకు మాత్రమే సొంతమంటూ మహిళలు కేసు పెట్టిన విచిత్రమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఏపీలోని రాయచోటి ప్రాంతానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ అనే యువకుడు మాదాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తుంటాడు. అదే ఆస్పత్రిలో పని చేసే యువతి రెండేళ్ల క్రితం అతనికి పరిచయం అయింది. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వెంగళరావునగర్ డివిజన్‌లోని ఒక బస్తీలో నివాసం ఉంటున్న యువతి రూముకు అనేకమార్లు వచ్చి తన కోర్కెను తీర్చుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత ఆమెకు చెప్పకుండా కార్ఖానాలోని మరో ఆస్పత్రిలో చేరాడు. అక్కడ పనిచేసే ఇంకో యువతితో సేమ్ సీన్ రిపీట్ చేశాడు. కట్ చేస్తే... (ఈ నెల 6న) ఎవరికీ చెప్పకుండా స్వగ్రామం వెళ్లాడు. అక్కడ తన ఇంటి పక్కనే ఉంటున్న యువతిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడు. ఈ నెల 24న నిశ్చితార్థం చేసుకోవాలనుకుని అనుకున్నాడు. పక్కాగా ప్లానింగ్ చేసి ఉంగరాలు, దండలు మార్చుకోవాలనుకునే సమయంలో సినీ ఫక్కీలో మధురానగర్ ఎస్ఐ ఇక్బాల్ షడన్‌గా రంగ ప్రవేశం చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు నిశ్చితార్థాన్ని చివరి నిమిషంలో అడ్డుకున్నాడు. అందరూ ఆశ్చర్యంగా చూస్తుండగా వారికి అతని ఫ్లాష్‌బ్యాక్ మొత్తం చెప్పి నిందితుడిని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. సమస్య పరిష్కారం అయిందనుకున్నారంతా... అయితే ఇక్కడే అసలు కథ మొదలైంది. ఫక్రుద్దీన్‌ను మధురానగర్‌కు తీసుకువచ్చారని తెలుసుకున్న బాధిత యువతులు బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అర్ధరాత్రి వరకు వీడు నా వాడు అంటే కాదు నా వాడంటూ ఇరువురు యువతులు వాదులాడుకున్నారు. దీంతో పోలీసులు అయోమయంలో పడ్డారు. ముందుగా నేను మోసపోయాను, కాబట్టి నాకే సొంతమంటూ ఒకరు, కాదు.. నావాడంటూ మరొకరు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఇరువురూ తమ ఆవేదను తెలియజేశారు. ఈ సమస్య ఎలా పరిష్కరించాలో అర్థంకాక మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తోపాటు ఎస్ఐ ఇక్బాల్ తలలు పట్టుకున్నారు. ఎట్టకేలకు ఎగ్బాల్‌ను పోలీసులు రిమాండ్ తరలించి ఊపిరిపీల్చుకున్నారు.